

"పేరుంటేనే ప్రగతికి సోపానం వేసినట్టు. లేకుంటే ఎందరి కాళ్లు పట్టుకుంటావయ్యా సుబ్బారావూ! ఓ పేపరు పెట్టు. రోజులెలా ఉన్నాయ్? నీ బాకా నువ్వు ఊదుకోవాలి. లేకపోతే ఎవడికి పట్టిందయ్యా ఊదిపెట్టడానికి?" క్లబ్బులో సాయంత్రం కూర్చుని పేక మొదలుపెడదామా? అన్న డోలాయమాన స్థితిలో ఉన్న సుబ్బారావుకి కీ ఇచ్చాడో పెద్దమనిషి.

# ఇక లాభం లేదు వెంకటేశం!

కె. రామలక్ష్మి

"పేక రోజా ఉన్నదే కదయ్యా! పద, అక్కడికే పోదాం. ఫారినా, ఇండియానా?" అంటూ బార్ రూమ్‌కేసి దారితీశాడు సుబ్బారావు.

అసలీ మధ్య సుబ్బారావు మనస్సంత బాగుండటంలేదు. డబ్బు కష్టాలో, కుటుంబ కలహాలో అనుకోనక్కరలేదు. అలాంటివాటికి అతీతుడే సుబ్బారావు. లంకంత కొంప, లోకం తెలియని పెళ్లాం, డబ్బు పారేస్తే చాలనుకునే ఓ కొడుకూ, పెళ్లయి అత్తారింట తన ఇనప్పెట్టెకి కూడా పునాది తవ్వుకున్న కూతురు ఉన్నారు. బెంగంతా .... ఇలాంటి విషయాలమీద కాదు. చిన్నా చితకా ధర్మాలు చేస్తున్నాడు. ధర్మప్రభువు అనిపించుకుంటున్నాడు. సమావేశాలకి వెడతాడు. సభా వేదికలని అలంకరిస్తూనే ఉంటాడు. అవి ఏర్పాటు చేసినవారు అడిగితే కాస్త ఆర్థికంగా ఆదుకుంటూనూ ఉంటాడు. కానీ ఏం లాభం ... ఫలానా ఫలానా వాళ్లందరితోపాటు గుంపులో గోవిందంగా సుబ్బారావు పేరు పడితే పడుతుంది. లేకుంటే, అదీ లేదు. ప్రాణం ఉసూరుమంటుంది సుబ్బారావుకి అలాంటప్పుడే.

ఒక్కొక్కసారి అనుకుంటాడు 'ఛస్తే ఈసారి వెళ్లను! పేరా ఊరా?!' అని. కానీ మరుక్షణం గుర్తుకు వస్తుంది 'ఫలానా ఫలానా వారితోనైనా తన పేరు రాదు కదా! వెడితే కనీసం ముఖం నల్గురు చూస్తారు' అనుకుంటాడు.

ఇదిగో ఇలా అల్లాడిపోతున్న అతనికి ఇంటిదగ్గర సలహాలిచ్చే బావమ్మరిది వెంకటేశ్వర్లు ఉన్నాడు. బొత్తిగా బావమ్మరిది కావడంతో చెప్పినా గట్టిగా చెప్పడు. నసుగుతాడు. "నీతో చిక్కే ఇది, వెంకటేశం! 'ఇది చెయ్యండి' 'అది చెయ్యండి', 'దీనివల్ల ఇదీ లాభం''దానివల్ల అదీ లాభం'అని క్షుణ్ణంగా చెప్పిచావ్వేం!" అని కసురుకుంటాడు. ఆ కోపం తాటాకు మంట. 'పాపం డబ్బు ఖర్చుతో కూడుకున్న పన్లు ధైర్యంగా, చేయమని ఎలా చెప్తాడు? కాస్త వెనుకతీస్తాడు' అనుకుని, "సర్లే, ఇంకోటేదైనా ఆలోచించి చూడు!" అని చల్లబడతాడు.

పెద్దమనిషి చక్కగా ఓ మూల టేబుల్ చూసి సద్దుక్కూర్చున్నాడు. "రారా, ఇక్కడ మనకి చికాకు ఉండదు!" అంటూ సుబ్బారావుని ఆహ్వానించాడు. "ఏ పెగ్గు కా పెగ్గు ఖరీదయ్యా! సీసా తెమ్మందాం!" అంటూ పెద్దమనిషి, అతి వినయంగా దీపం చుట్టూ తిరిగే ఇసెళ్లు జ్ఞప్తికి వచ్చే బేరర్‌ని కనుసన్నతోనే పిలిచాడు. శలీమని వచ్చి దీపంముందు వాలాడు బేరర్. సుబ్బారావుకి కూడా వినబడనంత నెమ్మదిగా తాగడానికీ, నమలడానికీ ఆర్డరిచ్చాశాడు పెద్దమనిషి.

"చూడిప్పుడు మాట్లాడుకుందాం!" అంటూ ముందుకు వంగి భుజం చరిచాడు.

"ఏమోనయ్యా, ఈమధ్య చాలా నిర్లిప్తంగా తయారయ్యారు. డబ్బుకు డబ్బు దుండుకుపోతున్నారు కానీ పేపర్లు రాయరు. ఎంత బాధగా ఉంటుందీ నువ్వే చెప్పు!" గ్లాసు చేతిలోకి తీసుకుంటూ అన్నాడు సుబ్బారావు.

"నిజమేనయ్యా!, మన ఉప్పు తిని మనకి న్యాయం చేయకపోతే బాధగానే ఉంటుంది. లేదూ, ఏకాంతంగా చూసి పీక పిసికేద్దామా అన్నంత కోపంగానూ ఉంటుంది. నాకు తెలుసు. నే నిలాంటివన్నీ విదిలించి నిలదొక్కుకుందుకు ఎన్నేళ్లు పట్టిందో నువ్వు ఊహించలేవు! చివరికిలా రాజకీయ కాపీదారునయ్యాక కదా ఇరుపక్కలవారితోనూ కాస్త బయటి ప్రపంచానికి తెలుస్తున్నాను!" అప్పటికే రెండో గ్లాసు ముగించాడు పెద్దమనిషి. మనసులో కష్టం చెప్పుకుందుకు ఆగిపోయి ... మొదటి గ్లాసే ముగించలేదు సుబ్బారావు. కాస్త ఘాటు ద్రావకం గొంతు దిగేసరికి ఆవేశం, ఉక్రోషం .... ఒకటేమిటి ఎన్నో భావాల కలగూరగంపగా తయారైంది సుబ్బారావు మనస్సు. ఎన్నెన్ని సంఘటనలు .... ఎన్నెన్ని అవకాశాలు .... కాకుల్లా తినేసి ఎగిరిపోయిన విషయాలన్నీ మూకుమ్మడిగా చుట్టుముట్టాయి సుబ్బారావుని.

"కానీ! ఏమిటీ అంత ఆలోచన? దాన్ని కానివ్వు! మరీ నీళ్లు కారిపోయాక ఎందుకూ తాగడం?" అంటూ సుబ్బారావుని హెచ్చరించాడు పెద్దమనిషి. జ్ఞాపకం వచ్చి ఒక్క గుక్కలో గ్లాసు ఖాళీ చేశాడు సుబ్బారావు. దాన్ని ఎంతో స్నేహపూర్వకంగా నిలిపాడు పెద్దమనిషి. "మార్గం ఆలోచించాలి గానీ, ఇలా నత్తగుల్లలాగా గుల్లలోకి ముడుచటుకుపోతే ఎలాగయ్యా? అధైర్యపడకు! అందరికీ బుద్ధి వచ్చేపని నీచేత నేను చేయించగలను!" అన్నాడు ధైర్యంగానూ, కాస్త గుంభనగానూ కూడా.

"అది కాదయ్యా! పిలిచి ఫొటోల్లో పడకుండా, టీ.వీ.లో కనబడకుండా తప్పించేస్తే ఎంత బాధ? నా కొడుకు అమెరికా వెడుతున్నప్పుడు అందర్నీ పిలిచి ఎంత పెద్ద పార్టీ ఇచ్చాను! వచ్చిన పత్రికల వారికందరికీ కవర్లు, చిన్నచిన్న బహుమతులు అందించానే! ఏ ఒక్కడూ తన పత్రికలో రాయలేదు. కనీసం మావాడి ఫొటో కూడా వేయలేదు! ఎంత దండగమారిగా మారిందో చెప్పలేను. తెలుసా? పిల్ల పెళ్లికి నిశ్చితార్థం గొప్పగా హోటల్లో పెట్టాను లంకంత ఇల్లు పెట్టుకుని. ఎందుకు? అంతా వస్తారు. టీ.వీ. వాళ్లకి .... అదీ ప్రైవేటు వాళ్లనే అనుకో పిలిచా. వచ్చిన ముత్తయిదువులకంతా పట్టు చీరా, కుంకుం భరిణ పెట్టించా. ప్రతిదాని పాదాలాకీ పాపం పిల్లచేత దండం పెట్టించా. నే పెట్టుకున్న వీడియోవాడు, ఫొటోవాడూ తీసినవేగానీ ... దారుణం ఎవ్వరూ ఈ విషయం చెప్పలేదు. మేసిన టీ.వీ. వాళ్లని నిలదీసి అడిగాను కూడా 'ప్రకటన రేటిస్తే వచ్చేస్తుంది సార్, మాదీ పూచీ!' అన్నారు ... ఇలా ఒకటా అరా ఎన్నని చెప్పనయ్యా? పెద్దాళ్లని [illegible]నాలకి పిలిచి ఆ విందుకి వాళ్లందరికీ ఆహ్వానాలు పంపాను. ఎన్నో కొత్తకొత్త రకాల వంటలు చేయించి పెట్టాను. హుఁ... మేసిపోయారే గానీ ఓ వార్త రాయలేదంటే నమ్ము. పోనీ, నేను పెద్దపెద్ద వాళ్ల పెళ్లిళ్లకి వెళ్లి ముఖం కనబడనంత పెద్ద పెట్టె బహుమతిగా అందించానా! అదీ పెళ్లి వాళ్ల వీడియోకు పరిమితం. మీటింగులో మాట్లాడితే మిగిలిన వాళ్లు పొగిడినా రాయరు! నేను బహుమతులు పంచినప్పుడు చింకిచేటంత ముఖం చేసుకున్న అందుకుంటున్నవాడి ముఖం నా చేతులూ! ఛా! నాకింక విసుగొచ్చేసింది. సాహితీ సేవ చాలు. రాజకీయాల్లోకి దిగితే, మరీ

## సుస్మిత సంబరం...!

'బీవీ నంబర్ వన్' చిత్రంతో తన దశ తిరిగిపోతుందని తెగ సంబరపడిపోతూంది మాజీ విశ్వసుందరి సుస్మితాసేన్. చిత్రం చూసిన వారంతా సుస్మిత నటన అద్భుతంగా ఉందని ప్రశంసిస్తుంటే, ఈ దెబ్బతో తనకు కనీసం పది చిత్రాల్లో అవకాశాలొస్తాయని ఆశ పడుతూంది సుస్మిత. కాని ఆ చిత్రం ప్రీమియర్ చూట్టానికెళ్లిన సుస్మితకు హఠాత్తుగా జ్వరం వచ్చి మంచం పట్టిందిట. ఈ విషయం చెప్పుకుని కొందరు నవ్వుతూంటే, మరి కొందరేమనుకుంటున్నారో తెలుసా? 'బీవీ నంబర్ వన్' చిత్రం చూశాక, ఇల్లాలినీ, పిల్లలనూ వదిలి మరో స్త్రీ పంచన చేరిన మగాళ్లెందరిలోనో మార్పు వచ్చి, ఇళ్లకు తిరిగి వెళ్లారని! ఈ విషయం ఎవరు చెప్పారో కదా! బహుశా చిత్రం పి.ఆర్.ఓ.నో, లేక సుస్మితే స్వయంగానో చెప్పి ఉంటారనీ అనుకుంటున్నార్ట. అవును మరి, చిత్రాన్ని హిట్ చెయ్యాలంటే ఎన్నో తిప్పలు పడాలిగా!

ఎస్.



ఖర్చెక్కువుతుందని ఆలోచిస్తున్నానయ్యా!" దీర్ఘంగా నిట్టూరుస్తూ గ్లాసు ఖాళీ చేసి కుర్చీలో జారపడ్డాడు సుబ్బారావు.

అప్పటికే నాలుగో గ్లాసుకి వచ్చేసిన పెద్దమనిషి బుర్రలో రకరకాల ఆలోచనలు ఒకటే క్లాష్ అయిపోతున్నాయి. తికమక పెట్టేస్తున్నాయి. సాధారణంగా ఫ్రీ డ్రింక్ పెద్దమనిషి, ఆఖరుదాకా తూలడు! మరింటికెళ్లాక వెల్లకిలా పడతాడేమో... తెలియదు.

సుబ్బారావు గ్లాసు నింపి అందిస్తూ, "నువ్వు అనవసరంగా అనవసరం అయినవాళ్లకి ప్రాముఖ్యం ఇస్తున్నావయ్యా సుబ్బారావు ... నే చెప్తా విను!" అని ధైర్యం చెప్పాడు. "ఏమో నాకంతా అయోమయంగా ఉంది. ఇంట్లో అంటే మా ఆవిడ 'పేరెందుకండీ ... మనకి దేనికి లోటు? ఇవన్నీ మాని హాయిగా ఉండండి. మరీ బోరుగా ఉంటే రండి, ఏ హరిద్వారం దాకానో వెళ్లివద్దాం! ఈ చిన్నచిన్న బాధలు మిమ్మల్ని పీడించవు!" అంటుంది. అంచేత కొంపలో నోరు మెదపడానికి లేదు. నా కోరికలూ ఆవేదనా, అసంతృప్తీ నా గుండెల్లో దాచుకుంటున్నానయ్యా! ఎప్పుడో ఈ గుండె కాస్తా ఠప్పని పేలిపోతుంది. అప్పుడైనా చిన్న ప్రింటులో నాలుగు లైన్సు వేస్తారా లేదా అన్నది అనుమానమే నాకు!"

"సుబ్బారావు! ఇలా ఆడదానిలా విలవిలలాడడం తగ్గించవయ్యా! ఇప్పుడు వాళ్లే ఆడడంలేదు! నా మాట విను, ఓ పేపరు పెట్టు. పెడ్తున్నావని తెలిస్తే చాలు ... వివిధ పత్రికల నుంచి వచ్చిపడతారు విలేఖర్లు, జర్నలిస్టులు, ఎడిటర్లు .... ఒక్క ప్రకటన ఇచ్చి చూడు. నా మాట నీకర్థం అవుతుంది!" భరోసా ఇచ్చాడు పెద్దమనిషి.

"పత్రిక పెట్టడం మాటలతో పని కాదయ్యా! మఖలో పుట్టి పుబ్బలో కనబడకుండా పోతున్నాయి, చూస్తున్నాం కదా!"

"అదెవరు పట్టించుకుంటారయ్యా! మనం పెట్టబోయే పత్రిక పరోపకారంకోసం కాదు. మనని మనం ఉద్ధరించుకుందుకే కదా! న్యూస్ ప్రింట్ తెచ్చుకొందుకో రాజకీయపు వ్యాసం, ఆడాళ్ల నాకర్షించడానికి ఒకటి రెండు వంటలో, వారి తీరని కలలకి సరిపడా సీరియలో కాస్త వేస్తే, కుర్రకారుకోసం ఓ హీరో హీరోయిన్‌ల సెక్సీ బొమ్మ ... మిగిలిన పేజీలన్నీ మనం కేటాయించుకుంటాం మనకోసం!" చాలా వివరంగా చెప్పాడు పెద్దమనిషి.

ఆలోచనలో పడి కాస్త నీళ్లయినా కలుపుకోకుండా అరగ్లాసు విస్కీ తాగిపారేశాడు సుబ్బారావు. కాస్త పొలమారింది. తల పేలిపోతుందా అనిపించింది క్షణంపాటు. కళ్లు మూసుకుని కుర్చీకి తల ఆన్చి కూర్చున్నాడు.

"ఇవన్నీ వినడానికి కష్టంగా అనిపిస్తాయి గానీ ... తీరా దిగాక ఓస్ అనిపిస్తాయి. ఈమధ్య కథ కావాలంటే నాలుగువేలమంది పంపారట. మనదంత పెద్ద ప్రాజెక్టు కాదు కనుక ఐదారొందల మందైనా రాస్తారు ... అంతకంటే ఎక్కువ వస్తే మనకే ఇబ్బంది! 'డబ్బక్కరలేదు, అచ్చేయండి' అనేవాళ్లు కోకొల్లలు వచ్చి పడతారు. నీకంత బెంగక్కరలేదు. తెలిసిన వ్యాపారస్తులు ఎలాగూ ప్రకటనలిస్తారు మొహమాటానికైనా. దాన్ని కాస్త రేటు తగ్గించి వార్షికం చేసుకోవచ్చు ...! ఇక, నీకెంత లేదన్నా పది పద్దెనిమిది పేజీలు అట్టేపెట్టుకుంటావన్నమాట!"

"నిజమేనంటావా?" అనుమానంగా అడిగాడు సుబ్బారావు. అతని చెవుల్లో సముద్రపు ఘోష. 'వద్దు' అంటూనే గ్లాసు అందుకున్నాడు.

"హాయిగా వెళ్లిన మీటింగుల గురించి, చక్కని చీరలు కట్టుకువచ్చినవారి గురించి ... ఒకటేమిటి ... మీరు పాల్గొన్న ప్రతి విషయం తు.చ. తప్పకుండా రాసుకోవచ్చు. లేదా, రాయించుకోవచ్చు. ఎవరెవరి కాళ్లో పట్టుకోవలసిన అవసరం ఉండదు. తగలెట్టే డబ్బేదో మనమే తగలెట్టవచ్చు. ప్రాణం ఉసూరుమనదు. ఏమంటావు? మనకిష్టం లేని వాళ్లేం చేసినా రాయం!"

అప్పటికే ఏం చేస్తున్నదీ, ఏం మాట్లాడుతున్నదీ తెలియడంలేదు సుబ్బారావుకి. అయినా పెద్దమనిషి చెప్తున్నది అర్థం అవుతున్నట్టే ఉంది.

"అయితే అదీ మార్గం అంటారు!" అన్నాడు కాస్త మాట తేల్చేస్తూ.

"అవునయ్యా! ఎవడికో డబ్బు పోయడం దండుగ! న్యూస్ ప్రింట్ పర్మిట్ వస్తుందనుకో ... మన పేపరు కెంత కావాలి? ... మిగిలినది హాయిగా అమ్ముకోవచ్చు. ముందు ప్రకటనలిచ్చినవాళ్లు సెంటిమెంటుకైనా డబ్బిచ్చేస్తారు. తరువాత చూసుకోవచ్చు. ఇక భయం వదిలి రంగంలోకి దిగు! నీ మేలు కోరేవాడ్ని, నష్టం, కష్టం కలిగించను కదా!" ఎంతో ఆప్యాయంగా, ఎంతో కుదురుగా అన్నాడు పెద్దమనిషి సీసాలో ఆఖరు సరుకు తన గ్లాసులో వంపుకుంటూ. సీసాలో ఓ అగ్గిపుల్ల గీసిపడేశాడు. అది బుస్సుమని వెలిగి ఆరింది. "చూశావా? శుభశకునం. గప్‌చిప్‌గా ఆరిపోలేదు. చప్పుడు చేసి మరీ ఆరింది .... పేరే ఆలోచించాలి, అంతే!"

"అదీ నువ్వే చెప్పు. ఇంటి దగ్గర దిగగానే నా బామ్మరిది వెంకటేశ్వర్లు అడుగుతాడు!" అక్షరానికీ అక్షరానికీ మధ్య దూరం పెరిగిపోతున్నట్టు అన్నాడు సుబ్బారావు.

"ఈ మధ్యనే రిజిస్ట్రారు దగ్గర పేరుకుపోయిన లక్షలాది పేర్లు జనం మీదకి వదిలేశారులేవయ్యా! ఏదో ఒకటి పెట్టుకోవచ్చు ..."

"అదీ ఇప్పుడే తేలాలి. నేను ఇల్లు చేరగానే బామ్మరిదికి చెప్పేయ్యాలి. చెప్పు, గట్టిగా ఆలోచించు. మందు మెదడు కెక్కితే అది చాలా షార్ప్‌గా ఆలోచిస్తుందంటారుగా ... చెప్పేయ్! ఇంకా ఇల్లు చేరాలి. ఈలోగా నువ్వు చెప్పిన మాట మరిచిపోకుండా ఉండాలి!" ముందుకు వంగి పెద్దమనిషి వేళ్ల గట్టిగా పట్టుకుని 'అబ్బా!' అంటూ వదిలాడు. ముందున్న మూడు వేళ్లకు దేవుళ్ల ఉంగరాలూ ముళ్లలాగా గుచ్చుకున్నాయి.

"కూర్చో, కూర్చో! పేరూ వచ్చేస్తూంది. ఓమారు కాగితం ఇలా పడేయ్! దానిమీద రాస్తా. ఇంటికెళ్లినా మరిచిపోతావు!" జేబులోంచి ఓ ఐదొందల నోటు తీసి ఇస్తూ, "ఇది ఎక్కడా చెల్లలేదన్నాడు మా వెంకటేశమ్. దీనిమీద రాయి!" అంటూ బల్లమీద పెట్టాడు. ఆ నోటు అందుకుని గాంధీపక్క తెల్లగా ఉన్నచోట 'మాకోసం' అంటూ రాసి చదివాడు. "వద్దు. నా కోసం!" అని రాయి. చుట్టాల న్యూసెన్స్ ఎక్కువ అవుతుంది!" ఆనందంగా లేచి, "నా కోసం! నా కోసం! బాగుంది. వెంకటేశమ్! ఇక తప్పదయ్యా! పత్రిక పెట్టాల్సిందే!" అంటూ ఓ అడుగు వేయబోయి నిలబడలేక కుప్పకూలిపోయాడు సుబ్బారావు.

"కాస్సేపటికి తెలివి వస్తుంది. కారుంది, ఎక్కించండి!" అని ఆర్డరేసి చక్కాపోయాడు పెద్దమనిషి ఈ రోజుకి గడిచిపోయింది అనుకుంటూ! ■

